ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -81 పేజీలు - 04 వెల - 04/- శుక్రవారం 3 ఏప్రిల్ 2026




# రాజ్యసభలోనూ ఆమోదం

వాకౌట్ చేసిన వైసీపీ

అమరావతికి చట్టపరమైన భరోసా కల్పిస్తూ చట్టసవరణ బిల్లు

రాజ్యసభలో చర్చ అనంతరం బిల్లుకు ఆమోదం

ఇప్పటికే లోక్ సభలో బిల్లుకు ఆమోదం



2లో.

# రాజధానిలో సంబరాలు



## ప్రజాస్వామ్య గొప్పదనాన్ని చాటిన చారిత్రక రోజు:చంద్రబాబు

ఉద్దండరాయుని పాలెంలో రైతుల సభకు సతీసమేతంగా హాజరైన సీఎం చంద్రబాబు

అమరావతిని చంపాలనుకున్న వైసీపీ బాగుపడదని తీవ్ర విమర్శలు

శంకుస్థాపన ప్రదేశంలో పవిత్ర మట్టి, జలాలకు సాష్టాంగ నమస్కారం చేసిన సీఎం



**అమరావతిఏప్రిల్ 2 ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్ ఏకగ్రీవంగా ఆమోదించడంతో రాజధాని ప్రాంత గ్రామాల్లో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ చారిత్రక విజయాన్ని పురస్కరించుకుని రైతులు, మహిళలు నిర్వహించిన వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీసమేతంగా పాల్గొన్నారు. 2015లో ప్రధాని నరేంద్ర మోదీ ఎక్కడైతే రాజధానికి శంకుస్థాపన చేశారో, అదే ఉద్దండరాయుని పాలెంలో జరిగిన ఈ కార్యక్రమం భావోద్వేగాల మధ్య సాగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులకు రైతులు, మహిళలు అపూర్వ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, పొంగూరు నారాయణ, అచ్చెన్నాయుడు, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఇది దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజని, ప్రజాస్వామ్య గొప్పదనాన్ని, ప్రజా సంకల్పాన్ని చాటి చెప్పిందని అభివర్ణించారు.

మిగతా 2లో.

## జ్యుడీషియల్ అధికారుల నిర్బంధంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ :ఏప్రిల్ 2 ఆంధ్ర ప్రగతి**

పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ..ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) విధుల్లో ఉన్న జ్యుడీషియల్ అధికారులను నిర్బంధించిన ఘటనపై సుప్రీంకోర్టు గురువారం

మిగతా 2లో.

# ఉద్యోగులకు తీపికబురు

ఉద్యోగులకు రూ.7,358 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదలకు గ్రీన్ సిగ్నల్

ఏ మాత్రం నిధుల లభ్యత ఉన్నా పెండింగ్ బిల్లులను చెల్లించాలని ముఖ్యమంత్రి ఆదేశం

బిల్లుల చెల్లింపుల్లో చిన్న కాంట్రాక్టర్లకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి సూచన

పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఆర్థిక శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష





**అమరావతిఏప్రిల్ 2 ఆంధ్ర ప్రగతి**

గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన పెండింగ్ బిల్లుల చెల్లింపులపై గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్థిక శాఖపై సమీక్షించారు. ఈ మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్

మిగతా 2లో.

## గ్రామీణాభివృద్ధికి కేంద్రం పెద్దపీట

పంచాయితీ నిధుల విడుదలే సాక్ష్యం

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,ఏప్రిల్ 02 (రిపబ్లిక్ న్యూస్):**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 2025-26 సంవత్సరానికి

మిగతా 2లో.



2లో.

## ప్రధాని మోదీకి కృతజ్ఞతలు

ఎన్డీయే ఎంపీలతో కలిసి ప్రధాని, లోక్‌సభ స్పీకర్‌తో లోకేశ్ భేటీ

అమరావతి రైతుల త్యాగాలను ప్రధానికి వివరించినట్లు వెల్లడి

లోక్‌సభలో ఆమోదం పొందిన ఏపీ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లు

రాజ్యసభ ఆమోదం కోసం ఢిల్లీలోనే పర్యటిస్తున్న లోకేశ్

## తెలంగాణలో 2 లక్షల కొత్త పెన్షన్లు..

రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

చేయూత కింద 2 లక్షల కొత్త పెన్షన్లకు ప్రభుత్వం ఆమోదం

బడ్జెట్‌లో రూ.233 కోట్లు కేటాయించిన రేవంత్ సర్కార్

మూడేళ్లుగా పేరుకుపోయిన 12 లక్షలకు పైగా దరఖాస్తులు

2లో.

# హర్మూజ్ మార్గం పునరుద్ధరణే లక్ష్యం..

35 దేశాలతో భేటీకి భారత్ హాజరు

హర్మూజ్ జలసంధి సంక్షోభంపై యూకే ఆధ్వర్యంలో 35 దేశాల సమావేశం

ఈ కీలక భేటీకి భారత్‌ను ఆహ్వానించిన యునైటెడ్ కింగ్‌డమ్

వర్చువల్ సమావేశానికి హాజరుకానున్న భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ



**న్యూఢిల్లీ ఏప్రిల్ 2 ఆంధ్ర ప్రగతి**

ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ మూసివేసిన హర్మూజ్ జలసంధి సంక్షోభం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన ఈ మార్గాన్ని తిరిగి తెరిపించేందుకు యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) నడుం బిగించింది. ఇందులో భాగంగా 35 దేశాలతో నిర్వహిస్తున్న అత్యవసర సమావేశానికి భారత్‌ను కూడా ఆహ్వానించింది. గురువారం వర్చువల్‌గా జరిగే ఈ భేటీలో భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ పాల్గొంటారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి

మిగతా 2లో.


# డయాఫ్రమ్ కంప్లీట్

ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టులో మరో కీలక ఘట్టం పూర్తయింది: చంద్రబాబునాయుడు

తక్కువ సమయంలో డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తయిందన్న ముఖ్యమంత్రి

ప్రాజెక్టు నిర్మాణంలో ఇది అత్యంత కీలకమన్న ముఖ్యమంత్రి

తక్కువ సమయంలో పూర్తి చేశారంటూ అధికారులకు కితాబు



2లో.

# రాజధానిలో సంబరాలు

**మొదటిపేజీ తరువాయి**

"అమరావతి చరిత్ర శాశ్వతం, అందులో రైతులు చేసిన త్యాగం శాశ్వతం. అనేక కుట్రలను ఎదుర్కొని ప్రజా రాజధానిని సాధించుకున్నాం. ఇది ప్రజల విజయం" అని చంద్రబాబు ఉద్ఘాటించారు. ఈ బిల్లుకు సహకరించిన ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాతో పాటు దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఒక్క వైసీపీ మినహా అందరూ అమరావతికి అండగా నిలిచారని గుర్తుచేశారు.

**అమరావతిని శ్మశానం అన్న వాళ్లు అడ్రస్ లేకుండా పోయారు: చంద్రబాబు**

గత ప్రభుత్వ తీరుపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "అమరావతిని శ్మశానం అన్నారు, కానీ ఇవాళ పార్లమెంటులో దానికి తిరుగులేని శాసనం చేశాం. రాజధానితో మూడు ముక్కలాట ఆడిన వాళ్లు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారు" అని విమర్శించారు. రాజధాని కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇస్తే, ప్రజా వేదికను కూల్చి విధ్వంసానికి



పాల్పడ్డారని ఆరోపించారు. ఇంత జరిగినా వైసీపీకి బుద్ధి రాలేదని, పార్లమెంటులో బిల్లుపై చర్చ జరుగుతుంటే వారి ఎంపీలు వాకౌట్ చేశారని, ప్రజలు ఆ పార్టీని బ్లాక్ అవుట్ చేయాలని పిలుపునిచ్చారు. వారి 'మావిగన్' అనే కొత్త ప్రతిపాదన అర్థం కాలేదని, వైసీపీవన్నీ బుద్ధిలేని వ్యాఖ్యలని, దుర్మార్గపు ఆలోచనలని దుయ్యబట్టారు.

**ఇది ప్రజా విజయం, రైతుల త్యాగం శాశ్వతం**

రాజధాని కోసం రైతులు, మహిళలు 1631 రోజుల పాటు చేసిన వీరోచిత పోరాటాన్ని చంద్రబాబు స్మరించుకున్నారు. నాడు ఉద్యమ శిబిరాలకు తాను సతీసమేతంగా వచ్చానని, రైతుల కష్టాలు చూసి తన భార్య భువనేశ్వరి చలించిపోయి తన చేతి గాజులను విరాళంగా ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. పవన్ కల్యాణ్ ముళ్ల కంచెలు దాటుకుని వచ్చి మద్దతు తెలిపారని, తాను స్వయంగా జోలె పట్టి విరాళాలు సేకరించానని చెప్పారు. శంకుస్థాపన ప్రదేశంలో చంద్రబాబు దంపతుల ప్రత్యేక

**పూజలు.. సాష్టాంగ ప్రణామం**

రాష్ట్రంలోని ప్రతీ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని అమరావతి సాక్షిగా హామీ ఇచ్చారు. "అమరావతి ఇక అన్‌స్టాపబుల్. ఇది అద్వితీయం, అజేయం, అజరామరం" అని చంద్రబాబు స్పష్టం చేశారు. అనంతరం చంద్రబాబు దంపతులు ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని పరిశీలించారు. పవిత్ర మట్టి, జలాలు ఉన్న వేదిక వద్ద సాష్టాంగ ప్రణామం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి దీప హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమం రాజధాని చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచిపోయింది.

# ఉద్యోగులకు తీపికబురు

**మొదటిపేజీ తరువాయి**

ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఆరా తీశారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులు జరపాలని గతంలో ఇచ్చిన ఆదేశాలను ఏ మేరకు అమలు చేశారని అడిగారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు కసరత్తు చేశామని, నిధుల లభ్యతను బట్టి చెల్లింపులను జరుపుతున్నామని అధికారులు వివరించారు.

ఉద్యోగులకు రిలీఫ్ ఇచ్చేలా మొత్తంగా రూ.7,358 కోట్ల మేర పెండింగ్ బిల్లుల విడుదలకు చర్యలు తీసుకున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. దీంట్లో భాగంగా ఇప్పటికే ప్రావిడెంట్ ఫండ్ బకాయిల కింద రూ.1,848 కోట్లను నేరుగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేశామని, అలాగే గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ కింద 4,793 మందికి సంబంధించిన రూ.76 కోట్ల చెల్లింపులు కూడా పూర్తి చేశామని వెల్లడించారు.వీటితో పాటు గ్రాట్యుటీ బకాయిల కింద రూ.3,411 కోట్లు, పెండింగులో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కింద రూ.1,800 కోట్లు, పోలీస్ శాఖకు సంబంధించి అదనపు సరెండర్ లీవుల నిమిత్తం రూ.223 కోట్ల బిల్లుల విడుదల ప్రక్రియ కొనసాగుతోందని మరో రెండు రోజుల్లో చెల్లింపులు పూర్తి చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. తల్లికి వందనం తర్వాత ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో చెల్లింపులు జరుపుతోంది ఉద్యోగులకు మాత్రమేనని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. నిధుల లభ్యతను బట్టి ఉద్యోగుల పెండింగ్ బిల్లుల సహా అన్ని రకాల పెండింగ్ బిల్లులకు చెల్లింపులు జరపాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల విషయంలో జరిగిన పరిణామాలు ప్రస్తావనకు వచ్చాయి. నాడు ఉద్యోగుల సొంత సొమ్మును కూడా నాటి ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించడంతో వారు తీవ్ర ఇబ్బందులుపడ్డారని, తమ నిధుల కోసం ప్రశ్నించిన నేతలపై కేసులు పెట్టి వేధించారనే అంశం చర్చకు వచ్చింది.ఇదే సమీక్షా సమావేశంలో వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లకు, మెటిరియల్ సరఫరా చేసిన వారికి జరపాల్సిన చెల్లింపులపైనా ముఖ్యమంత్రి ఆరా తీశారు. వివిధ శాఖలకు మెటీరియల్ సరఫరా చేసిన చిన్న చిన్న కాంట్రాక్టర్లకు రూ.614 కోట్ల బకాయిల చెల్లింపులు జరిపామని అధికారులు తెలిపారు. పనులు చేసిన, మెటిరీయల్ సరఫరా చేసిన వాళ్లకు బిల్లులు చెల్లింపులు జరిపే ప్రక్రియలో చిన్న కాంట్రాక్టర్లకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# రాజ్యసభలోనూ ఆమోదం

న్యూఢిల్లీ : **ఏప్రిల్ 2 ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు రాజ్యసభలోనూ ఆమోదం లభించింది. దీంతో ఈ బిల్లుకు పార్లమెంట్ ఉభయ సభల ఆమోదముద్ర ప్రక్రియ ముగిసింది. అనంతరం ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతికి పంపనుంది. ఈ బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేసిన తరువాత గెజిట్ నోటిఫికేషన్ విడుదలకానుంది. గురువారం రాజ్యసభలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రారు బిల్లును ప్రవేశపెట్టనున్నారు. అనంతరం రాజ్యసభ చైర్మన్ సిపి రాధాకృష్ణన్ ఈ బిల్లుపై చర్చకు అనుమతి ఇచ్చారు. ఈ చర్చలో 11 పార్టీలు నుంచి 18 మంది సభ్యులు పాల్గొన్నారు. అయితే వైసిపి రాజ్యసభలో కూడా బిల్లును వ్యతిరేకించి సభ నుంచి వాకౌట్ చేసింది.

**నాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు కృషి చేశారు: తెలంగాణ బీజేపీ ఎంపీ**

దూరదృష్టి గల నాయకుడిగా ఆనాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబునాయుడు కృషి చేశారని, విభజన తర్వాత ఏపీకి అమరావతి రాజధానిగా సంకల్పం తీసుకుని ముందుకు సాగుతున్నారని తెలంగాణ బీజేపీ నాయకుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. అమరావతికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారని, రెండు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే కట్టుబడి ఉందని అన్నారు. అమరావతి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు.వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం వికసిత్ రాజధాని అవసరమని ఆయన అన్నారు. రాజధాని అమరావతి కోసం 29 వేలమంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని గుర్తు చేశారు. భవ్య రాజధాని కోసం ఏపీ ప్రజలు కలలు కన్నారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పం సాకారమయ్యేందుకు వికసిత్ ఆంధ్ర నిర్మాణం అవశ్యమన్నారు. రాజధాని అవసరమని, కానీ జగన్ తన హయాంలో మూడు ముక్కలాడి రైతులు, మహిళలను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు.

రాజధాని కోసం చాలాకాలంగా పోరాడిన మహిళలకు, రైతులకు ఆయన శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. అమరావతి బిల్లు కోసం దేశం మొత్తం ఆసక్తిగా చూస్తోందని అన్నారు. తెలుగు వారికి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలని నాడు పొట్టి శ్రీరాములు 58 రోజులు నిరాహార దీక్ష చేసినా, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదని మండిపడ్డారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన ప్రాణాలు త్యాగం చేశారని అన్నారు. ఆయన మరణానంతరం ప్రభుత్వం స్పందించి ఆంధ్ర రాష్ట్రం ఇచ్చిందని అన్నారు

## అమరావతి బిల్లుపై ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి లోకేశ్, ఎన్డీయే ఎంపీలు..

న్యూఢిల్లీ :**ఏప్రిల్ 2 ఆంధ్ర ప్రగతి**

ఏపీ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఢిల్లీలో ఎన్డీయే ఎంపీలతో కలిసి ఆయన ప్రధానిని కలిశారు. ఈ సందర్భంగా ప్రధానికి శాలువా కప్పి, ఏపీ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ భేటీ అనంతరం లోకేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేస్తూ.. "అమరావతి కోసం తమ భూములను త్యాగం చేసి, ఏళ్ల తరబడి నిలబడిన రైతుల అసాధారణ గాథను ప్రధానికి వివరించాను. వారి త్యాగాలను గౌరవిస్తూ, అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా నిర్మించేందుకు ఆయన మార్గనిర్దేశం కోరాను" అని పేర్కొన్నారు.అనంతరం లోకేశ్, ఇతర ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కూడా కలిసి బిల్లు



ఆమోదానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజును కూడా కలిసి అమరావతికి చట్టబద్ధత కల్పించడానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. లోకేశ్ వెంట కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ ఎంపీలు ఉన్నారు.ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు 2026 బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందింది. ఈ బిల్లు నేడు రాజ్యసభ ముందుకు రానుంది. ఎగువ సభలోనూ ఇది ఏకగ్రీవంగా ఆమోదం పొందే అవకాశం ఉంది. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకే లోకేశ్ ఢిల్లీ పర్యటనకు వచ్చారు. 2014 నాటి పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 5ను సవరిస్తూ.. 'కొత్త రాజధాని' అనే పదం స్థానంలో 'అమరావతి కొత్త రాజధానిగా ఉంటుంది' అని ఈ బిల్లు స్పష్టం చేస్తోంది. తన పర్యటనలో భాగంగా లోకేశ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌ను కూడా కలవనున్నారు.

# గ్రామీణాభివృద్ధికి కేంద్రం పెద్దపీట

**మొదటిపేజీ తరువాయి**

సంబంధించిన మొదటి విడత నిధులు విడుదలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీల కోసం రూ.619.85 కోట్లు విడుదల చేయడాన్ని స్వాగతించారు కేంద్ర మంత్రి. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్' మంత్రాన్ని అక్షరాలా ఆచరణలో పెడుతూ ప్రతి గ్రామం సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తోందన్నారు. కేంద్రం విడుదల చేసిన రూ.619.85 కోట్ల నిధుల్లో రూ.371.91 కోట్లు టైడ్ గ్రాంట్, రూ.247.94 కోట్లు అన్ టైడ్ గ్రాంట్ కింద ఉన్నాయన్నారు. టైడ్ గ్రాంట్ నిధులతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, వర్షపు నీరు సంరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల పెంపు వంటి అనేక పనులు చేయవచ్చన్నారు. అన్ టైడ్ గ్రాంట్ నిధులను మాత్రం స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామ సభల్లో నిర్ణయం తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టుకోవచ్చని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం.. గ్రామీణ స్థానిక సంస్థలకు కేటాయించిన నిధులు కేంద్రం నుంచి రాష్ట్రాలకు అందిన వెంటనే ఆయా రాష్ట్రాల ఆర్థిక శాఖలు 10 పని దినాలలోపు సంబంధిత గ్రామ పంచాయతీలకు నిధులను వెంటనే బదిలీ చేయాల్సి ఉంటుంది. అంతకుమించి ఆలస్యం జరిగితే రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర పథకాల కోసం తీసుకున్న మార్కెట్ రుణాలు/రాష్ట్ర అభివృద్ధి రుణాల(÷ూఆఒ)పై చెల్లిస్తున్న వడ్డీ రేటు ప్రకారం గ్రామ పంచాయతీలకు వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుంది. అలాగే కేంద్రం విడుదల చేసిన నిధులకు సమానంగా మ్యాచింగ్ గ్రాంట్లు విడుదల చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు.తాజాగా 2025-26కు సంబంధించి రూ.619.85 కోట్లను మొదటి విడత కింద విడుదల చేసింది. ఇక, 16 ఆర్థిక సంఘం కింద 2026-27 నుంచి 2030-31 మధ్య కాలంలో తెలంగాణలోని గ్రామ పంచాయతీలు రూ.9,968 కోట్లను గ్రాంట్ రూపంలో కేంద్రం నుంచి పొందనున్నాయి.

తెలంగాణ ప్రభుత్వం సకాలంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించని కారణంగా.. రెండేళ్ల పాటు (2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన) నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగిన తర్వాత కేంద్రం వాటిని విడుదల చేసింది. తాజాగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడత నిధులనూ కేంద్రం విడుదల చేసింది. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా కేంద్రం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించాయి. అయినప్పటికీ.. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించగానే నిధులను విడుదల చేసింది. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలను రేండెళ్లపాటు నిర్వహించకుండా స్పెషల్ ఆఫీసర్ల పాలనతో రాష్ట్ర ప్రభుత్వం నెట్టుకొచ్చింది. ఇకపైనా ఎప్పటికప్పుడు యుటిలైజేషన్

సర్టిఫికెట్లు సమర్పిస్తే తదనుగుణంగా నిధులను విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అంటూ ప్రకటన జారీ చేశారు.

## హర్మ్యూజ్ మార్గం పునరుద్ధరణే లక్ష్యం..

**మొదటిపేజీ తరువాయి**

రణధీర్ జైస్వాల్ ధ్రువీకరించారు.

భారత ఇంధన భద్రతకు హర్మ్యూజ్ జలసంధి అత్యంత కీలకం. దేశం దిగుమతి చేసుకునే ముడి చమురులో 40శాతం, ద్రవీకృత సహజ వాయువు (ాచీ+)లో 50శాతం, ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ూా+)లో 80శాతానిపైగా ఈ మార్గం గుండానే రవాణా అవుతుంది. ఈ నేపథ్యంలో భారత నౌకల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఇరాన్‌తో పాటు ఇతర సంబంధిత దేశాలతో చర్చిస్తున్నామని జైస్వాల్ తెలిపారు. ఈ చర్చల ఫలితంగానే గత కొన్ని రోజుల్లో ఆరు భారత నౌకలు సురక్షితంగా జలసంధిని దాటగలిగాయని ఆయన వివరించారు.

ఈ సంక్షోభంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనూహ్యంగా స్పందించారు. గతంలో జలసంధిని తెరిపించడం తన ప్రాధాన్యత అని చెప్పిన ఆయన, బుధవారం తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ప్లేటు ఫిరాయించారు. "మీ చమురు మీరే తెచ్చుకోండి. మీ కోసం మీరు పోరాడటం నేర్చుకోండి. అమెరికా ఇకపై మీకు సహాయం చేయదు" అంటూ యూకే వంటి మిత్రదేశాలకు ఆయన సూచించారు. ఇరాన్‌ను ఇప్పటికే దెబ్బతీశామని, కష్టమైన భాగం పూర్తయిందని ట్రంప్ పేర్కొన్నారు.

మరోవైపు యూకే ప్రధాని కీర్ స్టార్మర్ మాత్రం ఈ విషయంలో వెనక్కి తగ్గలేదు. ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, యూఏఈ సహా 35 దేశాలు సముద్ర భద్రత పునరుద్ధరణకు కలిసి పనిచేయడానికి అంగీకరించాయని ప్రకటించారు. నౌకాయాన స్వేచ్ఛను పునరుద్ధరించడం, చిక్కుకుపోయిన నౌకలు, సిబ్బంది భద్రతను పటిష్టం చేయడం, కీలక సరుకుల రవాణాను తిరిగి ప్రారంభించడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. యూకే విదేశాంగ కార్యదర్శి వైవెట్ కూపర్ అధ్యక్షతన జరిగే ఈ భేటీ అనంతరం, తదుపరి కార్యాచరణపై అధికారులు చర్చిస్తారని సమాచారం.

## తెలంగాణలో 2 లక్షల కొత్త పెన్షన్లు.. రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

**హైదరాబాద్,ఏప్రిల్ 2 ఆంధ్ర ప్రగతి**

తెలంగాణలో కొత్త పెన్షన్ల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న లక్షలాది మందికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. చేయూత పథకం కింద కొత్తగా మరో 2 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా 2026-27 వార్షిక బడ్జెట్‌లో రూ.233 కోట్లను కేటాయించడంతో, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు రంగం సిద్ధమైంది. అయితే, ఇప్పటికే పేరుకుపోయిన లక్షలాది దరఖాస్తుల నుంచి అర్హులను గుర్తించడం అధికారులకు పెను సవాల్‌గా మారనుంది.

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరీలలో 42.23 లక్షల మంది నెలనెలా చేయూత పెన్షన్లు పొందుతున్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులు, హెచ్ఐవీ, బోదకాలు బాధితులకు నెలకు రూ.2,016 చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. దివ్యాంగులకు మాత్రం పెన్షన్‌ను రూ.4,016గా ఇస్తున్నారు. ఇప్పుడు ఈ జాబితాలోకి మరో 2 లక్షల మంది కొత్తగా చేరనున్నారు. గత మూడేళ్లుగా బోదకాలు, డయాలసిస్ బాధితులకు తప్ప కొత్తగా ఎలాంటి పెన్షన్లు మంజూరు కాకపోవడంతో అర్హులైన వారు తీవ్ర నిరాశలో ఉన్నారు.ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 లక్షలకు పైగా దరఖాస్తులు ప్రభుత్వానికి చేరి పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల బడ్జెట్‌లో కొత్త పెన్షన్ల ప్రకటన వెలువడిన తర్వాత, ఫిబ్రవరి 20 నుంచి ప్రజావాణి వంటి కార్యక్రమాల ద్వారా దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు, గురువారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న గ్రామసభల్లో కూడా భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.ప్రభుత్వం ఆమోదించినవి 2 లక్షల పెన్షన్లు కాగా, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య 12 లక్షలు దాటింది. వీటిలో వృద్ధాప్య పింఛన్ కోసం 4 లక్షలు, వితంతు, ఒంటరి మహిళల కోటాలో 3.5 లక్షలు, గీత, చేనేత కార్మికుల విభాగంలో 3 లక్షలు, దివ్యాంగుల పింఛన్‌కు 72 వేల దరఖాస్తులు ఉన్నాయి. ఈ భారీ సంఖ్య నుంచి కేవలం 2 లక్షల మంది అత్యంత అర్హులను ఎంపిక చేసేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు త్వరలోనే పటిష్టమైన వడపోత కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడం ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారింది.

## జ్యుడీషియల్ అధికారుల నిర్బంధంపై సుప్రీంకోర్టు ఆగ్రహం




**మొదటిపేజీ తరువాయి**

నాడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) లేదా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ)తో దర్యాప్తు చేపట్టాలని ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేసింది. బెంగాల్‌లో ప్రతి ఒక్కరూ రాజకీయ భాషే మాట్లాడుతున్నారని విచారణ సందర్భంగా భారత ప్రధానన్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ సూర్యకాంత్ అసహనం వ్యక్తం చేశారు. 'తప్పు ఎవరు చేస్తున్నారో మాకు తెలియదనుకుంటున్నారా? ఈ ఘటనను తెల్లవారుజామున 2 గంటల వరకు పర్యవేక్షిస్తూనే ఉన్నా. ఇది చాలా దురదష్టకరం' అని ఆయన అన్నారు. ఈ ఘటనపై పలువురు రాష్ట్ర అధికారులకు న్యాయస్థానం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. జ్యుడీషియల్ అధికారుల భద్రత కల్పించడంతో పాటు 'సర్' ప్రక్రియకు ఆటంకం కలగకుండా ఉండేందుకు కేంద్ర బలగాలను మోహరించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది.

అసలేం జరిగిందంటే..ఎస్ఐఆర్ పేరుతో పెద్దఎత్తున ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే మాల్దా జిల్లాలో బుధవారం ఆందోళనలు జరిగాయి. ఇక్కడ సర్ విధుల్లో ఉన్న ఏడుగురు జ్యుడీషియల్ అధికారులను సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఆందోళనకారులు నిర్బంధించారు. సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత అక్కడికి చేరుకొని అధికారులను రక్షించారు. అడ్డుకున్న ఆందోళనకారులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. నిర్బంధానికి గురైన వారిలో ముగ్గురు మహిళా అధికారులు కూడా ఉన్నారు. ఇదే అంశంపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందిస్తూ ఈ విషయంలో తాను చేసేదేమీ లేదని తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిశానిర్దేశంలో కీలుబొమ్మగా నడుస్తున్న ఎన్నికల సంఘమే ప్రస్తుతం రాష్ట్రంలో పాలనా వ్యవహారాలు చూస్తోందని, ఈ ఘటనలకు ఇసిదే బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.

# డయాఫ్రమ్ కంప్లీట్

**అమరావతిఏప్రిల్ 2 ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలన్న ప్రభుత్వ సంకల్పంలో నేడు మరో కీలక ఘట్టం పూర్తయిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన 1,372 మీటర్ల పొడవైన 'డయాఫ్రం వాల్' నిర్మాణాన్ని ఇరిగేషన్ శాఖ తక్కువ సమయంలో పూర్తి చేసిందని ప్రశంసించారు. ఇందుకు ఇరిగేషన్ శాఖ అధికారులకు, ఇంజనీర్లకు ఆయన అభినందనలు తెలిపారు.దీనికి సహకరించిన కేంద్ర సంస్థలకు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ ప్రతినిధులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా డీ-వాల్ దెబ్బతినడంతో అదనంగా రూ.1000 కోట్లు వెచ్చించి నిర్మించామని పేర్కొన్నారు.

డయాఫ్రమ్ వాల్ పూర్తి కావటంతో ప్రధాన కట్టడమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ పనులు వేగవంతమవుతాయని అన్నారు. ఇప్పటికే ప్రకటించినట్లు అన్ని పనులు పూర్తిచేసి 2027 పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితమిస్తామని పునరుద్ఘాటించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం 3 ఏప్రిల్ 2026

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల్లో కర్నూలు జిల్లా ప్రథమ స్థానం.

**సాధారణ కాన్పులకు పెద్దపీట. -..జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి.**






**ఆంధ్ర ప్రగతి కర్నూలు, ఏప్రిల్ 02:** ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల్లో కర్నూలు జిల్లా ప్రథమ స్థానం సాధించిందని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యధికంగా ప్రసవాలు నిర్వహించి కర్నూలు జిల్లా రాష్ట్రంలో టాప్ లో నిలిచిందని కలెక్టర్ తెలిపారు. 2025 ఏప్రిల్ నుండి 2026 ఫిబ్రవరి వరకు 11 నెలలకు 5500 ప్రసవాలు లక్ష్యం కాగా లక్ష్యానికి మించి 145 శాతం తో 7982 ప్రసవాలను నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో సాధారణ ప్రసవాలు 5881 కాగా, సిజేరియన్ కాన్పులు 2101 చేశామన్నారు. 30 శాతం మించి సిజేరియన్ కాన్పులు జరగకూడదని, జిల్లాలో 26 శాతం మాత్రమే సిజేరియన్ కాన్పులు చేసి, సాధారణ కాన్పులకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఎం సి హెచ్ ఆదోని, ఎమ్మిగనూరు ఏరియా హాస్పిటల్, పత్తికొండ , ఆలూరు, కోడుమూరు, వెల్దుర్తి, ఓర్వకల్లు సీహెచ్సీ ల్లో ఈ ప్రసవాలు జరిగాయని కలెక్టర్ వివరించారు.

# జిల్లాలో పశువులకు 5 జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటు కు చర్యలు.

**..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు , ఏప్రిల్ 02:**
కర్నూలు జిల్లాలో పొట్టేలు , మేకలు , గొర్రెలు యొక్క అధిక నివాస సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని ఐదు ప్రాంతాలలో వాటికి అవసరమైన జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటు చేయవలసిందిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి సంబంధిత కమిటీ సభ్యులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధ్యక్షతన జిల్లాలో పశుసంవర్ధక శాఖకు చెందిన షీప్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జనరిక్ మందుల అవుట్లెట్ లను ఏర్పాటు చేయుటకై కమిటీ సమావేశాన్ని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కమిటీ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ... జిల్లాలో పొట్టేలు, మేకలు , గొర్రెలు అధిక సంఖ్య లో ఉన్న ఐదు ప్రాంతాలు కర్నూలు , ఆదోని , పత్తికొండ , కోడుమూరు , హోలగుంద లలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పశు వైద్యశాలలలోని ప్రభుత్వ భవనాలు లేదా ఆసుపత్రి ప్రభుత్వ స్థలాలలో



జనరిక్ మందుల షాపులు ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ జెడి హేమంత్ కుమార్ ను ఆదేశించారు. ఈ మందుల దుకాణాలు ఏర్పాటు చేయడానికి కమిటీ సభ్యులు అన్ని విధాలుగా సహకరించాలని ఆదేశించారు.
ఆర్ అండ్ బి ఎస్ఈ ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రభుత్వ భవనాల కు సంబంధించిన రెంట్ ప్రపోజల్స్ మరియు రెవెన్యూ అధికారుల సహాయంతో వారు వాడుకునే స్థలాల లీజ్ ప్రపోజల్ , ఎస్టిమేషన్లు ఇవ్వవలసిందిగా , డ్రగ్ కంట్రోల్ అధికారి దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేయడం , జిల్లా సహకార శాఖ అధికారి షీప్ సొసైటీ సహకార సంఘాల ఆధ్వర్యంలో 4 దుకాణాలు మరియు స్వయం సహాయక బృందం తో ఒకటి ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకొన వలసిందిగా ఆదేశించారు.
ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ జెడి మాట్లాడుతూ... షీట్ ఫెడరేషన్ ఒక దుకాణం యూనిట్ కాస్ట్ 3 లక్షలు 61 వేలుగా నిర్ణయించడం జరిగిందని , నాలుగు సంఘాలు ఇప్పటివరకు ముందుకు వచ్చాయని , హొళగుంద దుకాణానికి సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ ద్వారా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా అందుకుగాను వారికి 1లక్ష 50 వేల రూపాయల సబ్సిడీ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ బ్లాక్ ప్రోగ్రామ్ కింద ఇస్తుందని మిగిలిన నాలుగు దుకాణాలకు ఆంధ్రప్రదేశ్ షీప్ ఫెడరేషన్ 1,50,000 సబ్సిడీ భరిస్తుందని కలెక్టర్ కు తెలియజేశారు.
ఈ సమావేశంలో కమిటీ సభ్యులు జెడి పశుసంవర్ధక శాఖ హేమంత్ కుమార్ , ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి , ఏడి డ్రగ్స్ కంట్రోల్ హరి హర తేజ ,డిసిఓ శిరీష , ఏడి షీప్ డెవలప్మెంట్ రవిప్రకాష్ రెడ్డి మొదలగు వారు పాల్గొన్నారు.

# కర్నూలు జిల్లాను "సింగిల్ యూజ్ ప్లాస్టిక్" రహిత నగరంగా మారుద్దాం.

**జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు, ఏప్రిల్ 02:**
కర్నూలు జిల్లాను "సింగిల్ యూజ్ ప్లాస్టిక్" రహిత నగరంగా మారుద్దాం అని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన అంశం పై జాయింట్ కలెక్టర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని అత్యంత కఠినంగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. నగరంలో ప్లాస్టిక్ నిషేధాన్ని పర్యవేక్షించడానికి మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యు ఎల్ బి స్థాయి టాస్క్ ఫోర్స్



కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నెలలో 2 సార్లు ఖచ్చితంగా అన్ని షాపులను తనిఖీ చేయడంతో పాటు, నిషేధిత ప్లాస్టిక్ అమ్మే వ్యాపారులపై దాడులు నిర్వహించి, ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకోవడంతో పాటు భారీగా జరిమానాలు విధించాలని ఆదేశించారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జాయింట్ కలెక్టర్ కోరారు. డప్పు



కళాకారులు, సంగీత ప్రదర్శనలు, పబ్లిక్ అనౌన్స్మెంట్ల ద్వారా ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాల గురించి వివరించి ప్రజలను చైతన్యపరచాలన్నారు. స్వయం సహాయక బృందాల ద్వారా పర్యావరణ హితమైన సంచుల విక్రయ మేళాలను పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు.
సమావేశంలో మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కుటుంబాలకు పవర్లూమ్ యూనిట్లకు ఉచిత విద్యుత్.

**..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, ఏప్రిల్ 02:** చేనేత సంక్షేమం లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్లూమ్ యూనిట్లకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ లో ఉచిత విద్యుత్ పథకం"కు సంబంధించిన కరపత్రాలను జిల్లా కలెక్టర్ అధికారికంగా విడుదల చేశారు. 07 మంది ఉచిత విద్యుత్ పథకం లబ్దిదారులకు ధృవపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం "ఉచిత విద్యుత్ పథకం" ద్వారా చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్లూమ్ యూనిట్లకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోందని, ఈ పథకం ద్వారా ఒక్కొక్క చేనేత కుటుంబానికి నెలకు రూ. 720/- చొప్పున సంవత్సరానికి మొత్తం రూ.8640/- మరియు ఒక్కొక్క పవర్ లూం యూనిట్ నిర్వాహకులకు నెలకు రూ.1800/- చొప్పున సంవత్సరానికి మొత్తం రూ.21,600/- ఆర్థికంగా లబ్ది కలుగుతుందని తెలిపారు. కర్నూలు జిల్లాలో ఈ పథకం ద్వారా 2457 చేనేత కుటుంబాలకు మరియు 01 మరమగ్గ కుటుంబానికి లబ్ది కలుగుతుందని తెలిపారు.ఈ పథకం ద్వారా చేనేత కార్మికులపై విద్యుత్ వ్యయం భారం తగ్గి, వారి జీవనోపాధి మెరుగుపడటంతో పాటు ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని, గ్రామీణ ఉపాధికి ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. అలాగే, చిన్న మరియు గృహాధారిత చేనేత కార్మికులకు ఈ పథకం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ జి.నాగరాజా రావు, జిల్లా చేనేత మరియు జౌళి శాఖ అధికారి, కర్నూలు & నంద్యాల, శ్రీ వి.నరసింహా రెడ్డి, అభివృద్ధి అధికారి(చే. జౌ) మరియు సహాయ అభివృద్ధి అధికారులు(చే.జౌ), చేనేత కార్మికులు, నాయకులు పాల్గొన్నారు

## ప్రభుత్వ సర్వజన వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 02:**
నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అత్యవసర విభాగంతో పాటు ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ (ఓపీ), రిజిస్ట్రేషన్ బ్లాక్, మెడికల్ ఎమర్జెన్సీ వార్డులను పరిశీలించారు.
ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రిలో శుభ్రత,



సమయపాలన, సేవల నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేసారు. ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించడం ప్రతి వైద్యుడి




బాధ్యత అని సూచించారు. అలాగే, రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సేవలను మరింత మెరుగుపరచాలని, అత్యవసర సేవలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

## స్వచ్ఛ రథం ని ప్రారంభించిన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి. ఫరూక్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల , ఏప్రిల్ 02:**
పరిసరాల పరిశుభ్రతను కాపాడుతూ, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛ రథం' వాహనాన్ని రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఈరోజు వారి నంద్యాల క్యాంపు కార్యాలయంలో నందు ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి పంచాయతీలో చెత్త సేకరణను శాస్త్రీయంగా నిర్వహించేందుకు ఈ స్వచ్ఛ రథాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రభుత్వ కార్యక్రమాలకు సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా ఎంపిడిఓ షేక్ అమానుల్ల మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరుస్తామని, ఈ రథం ద్వారా చెత్త సేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రామచంద్రరావు, టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, గోస్పాడు ఎంపిడిఓ షేక్ అమానుల్ల, నంద్యాల ఎంపీడీవో సుగుణ శ్రీ , డిప్యూటీ ఎంపిడిఓ శివ ప్రసాద్, స్వచ్ఛ రథం డ్రైవర్ సురేష్, గోస్పాడు మండల కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి , గోస్పాడు ఫరూక్ హుస్సేన్, గోపాల్ రెడ్డి, బాలన్న, కండే శ్యాంసుందర్ లాల్, చలం బాబు తదితరులు పాల్గొన్నారు.

## సానుకూల ప్రజాభిప్రాయం పెంపుదలపై ప్రత్యేక దృష్టి సారించండి.

**ప్రాజెక్టు జలధార అమలుపై పటిష్ట ప్రణాళిక రూపొందించండి.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 02:**
ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై సానుకూల ప్రజాభిప్రాయం పెంపుదలకు ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, 'ప్రాజెక్టు జలధార' అమలును సమర్థవంతంగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సానుకూలత మరియు ప్రాజెక్టు జలధార అమలుపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో సానుకూల ప్రజాభిప్రాయం పెంపుదలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఈ మేరకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజాసానుకులత పెంపుపై ప్రత్యేక చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఆరోగ్య శాఖలో సెకండరీ హెల్త్ సేవల పరంగా సున్నిపెంట మరియు పరిసర మండలాల్లో వైద్యుల కొరత కారణంగా ప్రజలకు సరైన సేవలు అందడంలో లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. బేతంచర్ల మండలంలో సరిపడా మరుగుదొడ్లు లేకపోవడం వల్ల ప్రజల నుండి మిశ్రమ స్పందన వస్తోందని పేర్కొంటూ, తగిన మౌలిక వసతులు కల్పించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.గ్యాస్ సరఫరాలో అక్రమ వసూళ్లపై కఠిన చర్యలు పౌర సరఫరాల విభాగానికి సంబంధించి బనగానపల్లె మరియు నంద్యాల పట్టణాల్లో గ్యాస్ సిలిండర్ల డెలివరీ సమయంలో నగదు వసూళ్ల జరగకుండా పర్యవేక్షణ పెంచాలని, అక్రమంగా డబ్బులు వసూలు చేసే డెలివరీ సిబ్బందిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు. రిజిస్ట్రేషన్ శాఖలో కార్యాలయాల్లో తెలుగులో బోర్డులు ఏర్పాటు చేయాలని, సేవలు పొందేందుకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అలాగే ఔకు మరియు నందికొట్కూరు మండలాల్లో ప్రజా సంతృప్తి తక్కువగా ఉన్నందున ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాజెక్ట్ జలధారా కింద వాగులు, చెరువులను పునరుద్ధరించండి.జిల్లాలో భూగర్భ జలాలపై అధిక ఆధారపడటం వల్ల నీటి మట్టాలు పడిపోతున్నాయని, ఈ సమస్యకు పరిష్కారంగా "ప్రాజెక్ట్ జలధారా" కింద వాగుల పునరుద్ధరణ, చెరువుల అభివృద్ధి, చెక్‌డ్యామ్‌లు, రీచార్జ్ నిర్మాణాల ద్వారా నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంచే చర్యలు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని జలవనరులు, భూగర్భజల, డ్వామా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. +×ూ సాంకేతికతతో నీటి అధిక, కొరత ప్రాంతాలను గుర్తించి అనుసంధానం చేయాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్ట్ అమలు చేసి, నీటి మట్టాలు పెరగడం, బోర్లు పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## నంద్యాల మున్సిపాలిటీలో అమరావతి సంబరాలు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 02:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతిని శాశ్వత రాజధానిగా చట్టబద్ధ గుర్తింపు లభించిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆనందోత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఈ నిర్ణయం రాష్ట్ర ప్రజల దీర్ఘకాలిక ఆశయాలకు న్యాయం చేయడమే కాకుండా, భవిష్యత్ అభివృద్ధికి దారితీసే కీలక ఘట్టంగా విశ్లేషిస్తున్నారు.
ఈ సందర్భంగా నంద్యాల మున్సిపాలిటీలో ఘనంగా సంబరాలు నిర్వహించారు.



కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దారు. కార్యాలయం ముందు రంగురంగుల ముగ్గులు వేసి సిబ్బంది ఆనందోత్సాహాలతో కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి అమరావతి నిర్ణయాన్ని హర్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న, మెప్మా పీడీ వెంకటదాస్, ఎంఈ గురప్ప యాదవ్, డీఈలు నాగభూషణ్ రెడ్డి, పవన్ కుమార్, రసూల్, రెవెన్యూ అధికారి వెంకటరెడ్డి. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్. శభరిష్. శానిటేషన్ సూపర్వైజర్లు లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ఈ సంబరాలు నగరంలో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపాయి.

# ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలి.

**జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు, ఏప్రిల్ 02:**
భూసారాన్ని పెంచడానికి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేసే విధంగా వారికి ప్రోత్సహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో సహజ వ్యవసాయం పై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులందరూ మరియు పచ్చి రొట్ట ఎరువుల సాగు చేసేలా అధికారులు జాగ్రత్త వహించాలన్నారు. భూమి లేని ఒక మహిళ, కేవలం 50 సెంట్ల భూమిని కౌలుకు తీసుకుని, సొంతంగా విత్తనాలు తయారు చేసుకుని ప్రకృతి వ్యవసాయం ద్వారా నెలకు దాదాపు ₹20,000 నుండి ₹30,000 వరకు సంపాదిస్తూ, ఏడాదికి ₹1.20 లక్షల ఆదాయం పొందుతున్నారన్నారు. కూలి పనుల కోసం గుంటూరు, హైదరాబాద్ లేదా కర్ణాటక వంటి ప్రాంతాలకు వలస వెళ్లేకంటే, ఇలాంటి స్వయం ఉపాధి మార్గాలు ఎంతో మేలని కలెక్టర్ పేర్కొన్నారు.

నేల సారాన్ని కాపాడటం కొరకు పిల్లి పెసర, సన్ హెమ్ప్, దైంచా వంటి పచ్చి రొట్ట ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు. అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, క్షేత్ర స్థాయి పర్యటనలు పెంచాలని మరియు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, పంట నష్టాలు జరుగకుండా, రైతులకు సరైన మార్గదర్శకత్వం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

వ్యవసాయం,అనుబంధ శాఖల ద్వారా తలసరి ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సంవత్సరం వర్షాలు తక్కువగా పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని, స్థానిక నేల స్వభావం, వర్షపాతం మరియు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేయడంలో రైతులకు వ్యవసాయ అధికారులు సహాయపడాలన్నారు. పత్తికి మంచి ధర లభిస్తోంది, కాబట్టి దాన్ని ప్రోత్సహించాలన్నారు. రైతుకు 3 ఎకరాలు ఉంటే, కనీసం 4 రకాల పంటలు వేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఉద్యానవన పంటల సాగును పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని, ఈ సంవత్సరం మల్లెపూల సాగు 1000 హెక్టార్ల లో పెంచాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం అన్నారు. మల్లె సాగు వల్ల రైతుకు నాలుగు, ఐదు నెలల కాలంలో మంచి ధర లభిస్తుందని, తద్వారా రైతు చేతికి ఎక్కువ డబ్బు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. మల్లెపూలతో పాటు మామిడి, అరటి, దానిమ్మ పంటలను కూడా ప్రోత్సహించాలన్నారు.

ప్రతి మండలానికి కనీసం పది హాఫ్ మూన్ మోడళ్లను ఏర్పాటు చేసే విధంగా లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. మండలాలలో ఎఫ్‌పిఓల సంఖ్య పెరగాలని, అందులో సభ్యుల సంఖ్య ఎంత పెరిగిందనే వివరాలను వ్యవసాయ అధికారులు ఇవ్వాలన్నారు. పంట పండించడమే కాకుండా, ఎక్కడ అమ్మితే ఎక్కువ లాభం వస్తుందో తెలుసుకోవడానికి కర్ణాటక, హైదరాబాద్



వంటి ప్రాంతాలకు ఒక బృందాన్ని పంపి మార్కెట్ అధ్యయనం చేయించాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రాయలసీమను ఉద్యానవన కేంద్రంగా మార్చేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా పోస్ట్ హార్వెస్ట్ స్ట్రక్చర్ నిర్మాణానికి భారీ పెట్టుబడులు అవసరమని, ప్రభుత్వం ఒక సమగ్ర నమూనాను సిద్ధం చేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. పంటలను తరలించడానికి రోడ్ల అభివృద్ధి, రవాణా సౌకర్యాలు మరియు మార్కెటింగ్ సహాయంతో కూడిన ఒక లాజిస్టిక్ పార్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు. వ్యవసాయంలో డ్రోన్ల వాడకాన్ని పెంచాలని కలెక్టర్ సూచించారు. ట్రాక్టర్లు, ప్లోయింగ్ మిషన్లు, టిల్లర్లు మరియు విత్తనాలు వేసే యంత్రాలను రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా పొందేలా అవగాహన కల్పించాలని చెప్పారు. కూలీల కొరత మరియు పెరుగుతున్న ఖర్చుల వల్ల పెట్టుబడి పెరుగుతోందని, యంత్రాలను వాడటం ద్వారా ఈ ఖర్చులను తగ్గించుకోవచ్చున్నారు.

యూరియా వాడకాన్ని గణనీయంగా తగ్గించాలని మరియు నానో యూరియా వినియోగాన్ని పెంచాలన్నారు. రైతులకు ఆదాయం పెరగాలంటే పశువుల పెంపకం చాలా ముఖ్యమని, ప్రతి రైతు కనీసం ఒక పశువునైనా (ఆవు, బర్రె, గొర్రె, మేక లేదా కోడి) పెంచాలని కలెక్టర్ సూచించారు. యానిమల్ హస్బెండరీ డిపార్ట్‌మెంట్‌కు కేవలం 400 పశువుల పంపిణీ లక్ష్యం సరిపోదని, జిల్లాలోని 3.5 లక్షల కుటుంబాలకు పశువులను అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసక్తి ఉన్న రైతులకు లోన్లు ఇప్పించి పశువులను కొనుగోలు చేయించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులకు నిరంతర ఆదాయం లభించాలని, వారి తలసరి ఆదాయం పెరగడమే తన ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళ, బుధవారాల్లో ఈ విషయాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

కొత్త సాంకేతికతలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పంటలు వేసేటప్పుడు వెదజల్లడం కాకుండా, బెడ్స్ వేసుకోవాలని లేదా డిబ్లర్ ఉపయోగించాలని, దిగుబడి పెంచడానికి మెరుగైన విత్తన రకాలను వాడాలనే విషయాల గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కె.వి.కె శాస్త్రవేత్తల సహాయంతో కొత్త టెక్నిక్స్ నేర్చుకుని, ఆ సమాచారాన్ని రైతులకు చేరవేయాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. నీటి లభ్యత ఉన్న చోట అందరూ వరి సాగు చేస్తున్నారని, దీనివల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయన్నారు. వరి సాగును తగ్గించి ఆయిల్ పామ్ వంటి ఇతర లాభదాయకమైన పంటల వైపు రైతులను ప్రోత్సహించాలన్నారు. హాఫ్ మూన్ మోడల్ మరియు పీఎండీఎస్ పద్ధతులలో సుమారు 15 రకాల విత్తనాలతో సీడ్ పెల్లెట్స్ ఎలా తయారు చేసుకోవాలో, వాటిని ఎలా చల్లాలో రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ పద్ధతి ద్వారా 45 రోజుల్లోనే పంట చేతికి వస్తుందని పేర్కొన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు వారికి ఉన్న పొలంలో కేవలం ఒక పంట కాకుండా 4, 5 రకాల పంటలు వేయడం, పాడి పశువులను పెంచడం ద్వారా వారికి ఎంతో లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ కు వివరించారు.

సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి రాజాకృష్ణ రెడ్డి, న్యాచురల్ ఫార్మింగ్ అధికారి మాధురి, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధాని.

**కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ ఆవరణలో ఘనంగా వేడుకలు. -జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 02:**
అమరావతికి శాశ్వత రాజధానిగా చట్టబద్ధత లభించడం రాష్ట్ర చరిత్రలో ఒక మహత్తర ఘట్టంగా నిలిచిందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ ఆవరణలో జిల్లా యంత్రాంగం సమిష్టిగా పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించింది. ఆవరణ ముందుభాగాన్ని ఆకర్షణీయంగా రంగవల్లికలతో, దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జ్యోతి వెలిగించి, కేక్ కట్ చేసి అధికారులు, సిబ్బందితో కలిసి ఉత్సాహభరితంగా వేడుకలను జరుపుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన అనంతరం రాజధాని లేని పరిస్థితి రాష్ట్ర అభివృద్ధికి ఒక ప్రధాన లోటుగా నిలిచిందని, అయితే రాష్ట్ర ముఖ్యమంత్రి గారి దూరదృష్టి, సంకల్పబలం, అలాగే ప్రజల సమగ్ర భాగస్వామ్యంతో అమరావతిని ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా అభివృద్ధి చేసే ప్రక్రియకు బలమైన పునాది ఏర్పడిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఆనందోత్సాహాలతో వేడుకలు జరుపుకుంటున్నారన్నారు. గ్రామాల నుండి పట్టణాల వరకు, ప్రతి ఇంట్లో, ప్రతి వాడలో, అలాగే అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొందని



కలెక్టర్ తెలిపారు.

అమరావతి కేవలం రాజధాని నగరమే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తుకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. అభివృద్ధి, పారదర్శక పాలన, ఆధునిక మౌలిక సదుపాయాల సమాహారంగా అమరావతి అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల ఆశయాలను నెరవేర్చే కేంద్రబిందువుగా అమరావతి నిలుస్తుందని అన్నారు. అలాగే ఈ చారిత్రాత్మక సందర్భాన్ని సాధ్యం చేసిన గౌరవ ముఖ్యమంత్రి గారికి మరియు రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా యంత్రాంగం తరఫున హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ ఘట్టంలో భాగస్వాములైనందుకు గర్వంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని నంద్యాల జిల్లా కలెక్టరేట్‌లో కూడా జిల్లా యంత్రాంగం సమిష్టిగా పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొని రాష్ట్ర అభివృద్ధి దిశగా అమరావతి కీలక పాత్ర పోషిస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాము నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అహోబిలం పారువేట ఉత్సవంకు యూనెస్కో గుర్తింపు కోసం పార్లమెంట్ లో గళం విప్పిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఏప్రిల్ 02:**
గురువారం భారత పార్లమెంట్ లో అహోబిలం పారువేట ఉత్సవానికి యునెస్కో వారసత్వ గుర్తింపు కోసం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కేంద్ర ప్రభుత్వం కు విన్నవించారు.




ఆంధ్రప్రదేశ్ లోని నంద్యాల జిల్లా, ఆళ్ళగడ్డ అసెంబ్లీ నియోజకవర్గం, నల్లమల కొండలలోని అహోబిలం ఆలయంఉందని, శ్రీ లక్ష్మి నరసింహ స్వామికి అంకితం చేయబడిన అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రాలలో ఒకటి అహోబిలం అని, నరసింహస్వామి తన ఉగ్రరూపంతో అవతరించిన ప్రదేశంగా అహోబిలంను పూజిస్తారని, ప్రహ్లాదుడిని రక్షించి, చెడును సంహరించడానికి. నవ నరసింహ అని పిలువబడే నరసింహుని తొమ్మిది రూపాలతో కూడిన ఈ అహోబిలం ఆలయం భక్తి, ధైర్యం, దైవ కృపకు ప్రతీకగా నిలుస్తుందని, అహోబిలంలోని అటవీ సమీప ప్రాంతంలో ఉన్న 33 గ్రామాలలో 40 రోజుల పాటు 'పారువేట ఉత్సవం' అనే ఒక ప్రత్యేకమైన పండుగను జరుపుకుంటారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ఆరు శతాబ్దాలకు పైగా కొనసాగుతున్న ఈ పారువేట ఉత్సవ పండుగ, విశ్వాసం, భక్తి, సామాజిక, మత సామరస్యానికి ఒక విశిష్ట ఉదాహరణ అని, భక్తులను ఆశీర్వదించడానికి మహా అవతార్ నరసింహ విగ్రహాన్ని ప్రతి వీధికి, ప్రతి ఇంటికి ఊరేగిస్తారని, చెంచు గిరిజన సమాజానికి ఆ దేవుడితో ఒక ప్రత్యేకమైన సాంస్కృతిక అనుబంధం ఉందని. ఎందుకంటే, రాక్షస రాజు హిరణ్యకశిపుడిని సంహరించి, ప్రహ్లాదుడిని రక్షించిన తరువాత, ఆ దేవుడు చెంచు లక్ష్మిని వివాహం చేసుకున్నాడని నమ్ముతారన్నారు. మహా అవతార్ నరసింహ కథ గొప్ప భక్తితో నిండిన కథ. ప్రతి తల్లి తన బిడ్డ పరమేశ్వరుని పట్ల భక్తిగల భక్త ప్రహ్లాదునిలా ఉండాలని కోరుకుంటుందని, పారువేట ఉత్సవం దాని విశిష్టత కారణంగా ఒక సజీవ సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుందని. ఆరు శతాబ్దాలకు పైగా వారసత్వంగా వస్తున్న ఈ జ్ఞానం, నైపుణ్యం యునెస్కో వారి మానవజాతి అమూర్త సాంస్కృతిక వారసత్వంగా గుర్తింపు పొందడానికి అర్హమైనదని, ఇది మౌఖిక సంప్రదాయాలను, ఆలయ ఆచారాలను, సామూహిక భాగస్వామ్యాన్ని తరతరాలుగా విశ్వాసం సంక్రమించడాన్ని పరిరక్షిస్తుందని. అడ్డంకులను తొలగించి, సామూహిక గుర్తింపును బలోపేతం చేయడం ద్వారా సామాజిక సామరస్యాన్ని ప్రోత్సహిస్తుందని. శతాబ్దాల నాటి ఈ ఆచారం సమాజానికి భిన్నత్వంలో ఏకత్వాన్ని గుర్తు చేస్తుందని. దీనిని ప్రపంచ స్థాయిలో గుర్తించడం ద్వారా ఈ ప్రాచీన సంప్రదాయాన్ని పరిరక్షించడమే కాకుండా, శాంతి, భక్తి, ఐక్యతను ప్రేరేపిస్తూనే ఉన్న భారతదేశపు సజీవ ఆధ్యాత్మిక వారసత్వాన్ని కూడా మనం గౌరవించినట్లు అవుతుందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లోక్ సభ దృష్టికి తెచ్చారు.

అహోబిలం పారువేట ఉత్సవానికి యునెస్కో సాంస్కృతిక వారసత్వ హోదాను సిఫార్సు చేయాలని భారత ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నానని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లోక్ సభలో విన్నవించారు.

# ప్రకృతి వ్యవసాయ విధానాలతో ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించాలి.

**రైతులకు నీటి నిర్వహణ, పోషక లోపాలపై అవగాహన అత్యవసరం.**

**ఉద్యాన పంటల పెంపుతో జిల్లాకు ఆర్థిక వృద్ధి సాధ్యం. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 02:**
జిల్లాలో ఉద్యాన పంటలను విస్తృతంగా పెంపొందించడం ద్వారా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)ను పెంచే అవకాశాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్‌లో ఉన్న బి9 గ్రాండ్ హోటల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ – కన్వర్జెన్స్ విభాగాల సమన్వయ శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావంతో ఇప్పటికే జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, రాబోయే మే, జూన్ నెలల్లో మరింత పెరిగే అవకాశముందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో భూమి సారాన్ని కాపాడుకోవడం, లాభదాయకమైన పంటల ఎంపిక వంటి అంశాలపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించడం అవసరమన్నారు.

**ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ ప్రాముఖ్యం**

పీఎండీఎస్ విధానం ద్వారా భూమిని ఏడాది పొడవునా పంటలతో కప్పి ఉంచవచ్చని, ఇది ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. రైతులు ఈ విధానాన్ని విస్తృతంగా అనుసరించి, అందుబాటులో ఉన్న పీఎండీఎస్ కిట్లను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు.

**ప్రకృతి వ్యవసాయం - అదనపు ఆదాయానికి మార్గం**

పొలాల గట్లను వెడల్పుగా తయారు చేసి వాటిపై కూరగాయలు, ఆకుకూరలు సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా రైతుల ఖర్చులు తగ్గడంతో పాటు, పంటల నాణ్యత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

**భూసార పరీక్షలు, ఎరువుల వినియోగంపై దృష్టి**

జిల్లాలో నైట్రోజన్ లోపం ఉండగా, ఫాస్పరస్ అధికంగా ఉండటం, జింక్, సల్ఫర్ తక్కువగా ఉండటం గమనార్హమని తెలిపారు. అందువల్ల రైతులు భూసార పరీక్షలు చేయించుకొని అవసరమైన పోషకాలను గుర్తించి, యూరియా, డీఏపీపై ఆధారపడకుండా కాంప్లెక్స్ ఎరువులను వినియోగించాలని సూచించారు.

**నీటి వినియోగంలో సమర్థత అవసరం**

నీటి లభ్యత పరిమితంగా ఉన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకోవాలని, అధిక నీరు అవసరమయ్యే వరి సాగును తగ్గించి ఉద్యాన పంటల వైపు రైతులు మళ్లాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న ఉద్యాన పంటల విస్తరణలో జిల్లా అధికారులు చురుకుగా పనిచేయాలని ఆదేశించారు.

**అధికారుల సమన్వయం కీలకం**

వ్యవసాయ, ఉద్యాన, డీఆర్‌డీఏ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు సాంకేతిక పరిజ్ఞానం చేరవేయాలని కలెక్టర్ సూచించారు. అధికారులు తమ పరిజ్ఞానాన్ని నిరంతరం నవీకరించుకుంటూ, రైతులకు మార్గనిర్దేశం చేయాలని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, డీఆర్‌డీఏ ప్రతినిధులు, ప్రకృతి వ్యవసాయ నిపుణులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకంలో గుడ్ల కొరతపై మంత్రి ఫరూక్ సీరియస్.

**వెంటనే స్పందించి గుడ్లు సరఫరా చేసిన అధికారులు.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 02:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఈరోజు నంద్యాల పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో ఉన్న మున్సిపల్ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన విషయం అందరికీ తెలిసిందే . పాఠశాలలోని వసతులను, విద్యా బోధనను పరిశీలించిన మంత్రి ఫరూక్ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా విద్యార్థులకు అందజేస్తున్న భోజనాన్ని పరిశీలించగా, మెనూ ప్రకారం ఉండాల్సిన గుడ్లు లేకపోవడాన్ని మంత్రి ఫరూక్ గమనించారు. దీనిపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదని హెచ్చరించారు. వెంటనే మంత్రి ఫరూక్ సంబంధిత విద్యాశాఖ అధికారులతో ఫోన్ లో మాట్లాడి, గుడ్ల పంపిణీలో జరుగుతున్న లోపాలను ప్రశ్నించారు. మంత్రి ఫరూక్ ఆదేశాలతో అప్రమత్తమైన అధికారులు గంటల వ్యవధిలోనే స్పందించి నంద్యాల డీఈవో జనార్ధన్ రెడ్డి, ఎంఈఓ బ్రహ్మం నాయక్ పాఠశాలకు అవసరమైన గుడ్ల నిల్వలను సరఫరా చేశారు.

ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని . మధ్యాహ్న భోజనం విషయంలో ఎటువంటి అలసత్వం వహించినా సహించేది లేదని. ప్రతి విద్యార్థికి మెనూ ప్రకారం పౌష్టికాహారం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి అని ఆదేశించారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం 3 ఏప్రిల్ 2026

# రాష్ట్రస్థాయి మాస్టర్స్ క్రీడల్లో రాణించిన కర్నూలు పోలీసు క్రీడాకారులు.

## విజేతలైన పోలీసు క్రీడాకారులను అభినందించిన.కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్.

**ఆంధ్ర ప్రగతి కర్నూలు క్రైమ్ ఏప్రిల్ 02:**



ఆంధ్రప్రదేశ్ శాప్ లీగ్ మాస్టర్స్ క్రీడలలో పాల్గొని బంగారు, వెండి, కాంస్యం పతకాలు సాధించిన ఆర్ ఎస్సై, కానిస్టేబుల్ ను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ అభినందించారు.

గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సీటిలో మార్చి 30, 31 తేదిలలో 35 నుండి 45 ఏళ్ళ వయస్సు విభాగంలో ఈ రాష్ట్ర స్ధాయి పోటీలు జరిగాయి.ఈ పోటిలలో ఆర్ ఎస్సై పి.ఆర్ మహేశ్వరెడ్డి, కానిస్టేబుల్ శివకుమార్ లు పతకాలు సాధించారు. ఈ సంధర్బంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో విజేతలైన పోలీసు క్రీడాకారులు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. కర్నూలు ఎస్పీ గారు మెడల్స్ మరియు శాలువతో సన్మానించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. పోలీసు విధులలో ఒత్తిడితో ఉంటూ క్రీడలలో కూడా రాణించడం గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి జిల్లా పోలీసు శాఖకు మరింత మంచి పేరు తీసుకురావాలని జాతీయ, అంతర్జాతీయ స్ధాయిలలో రాణించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆకాంక్షించారు. ఆర్ ఎస్సై పి.ఆర్ మహేశ్వర రెడ్డి ...గుంటూరు ఆచార్యయూనివర్సీటిలో 800 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 1500 మీటర్ల పరుగు పందెంలో వెండి పతకం సాధించారు.గత 5 సంవత్సరాలుగా మాస్టర్స్ అథ్లెటిక్స్ లలో పాల్గొంటూ , చెన్నై నేషనల్ మీట్ లలో కూడా ప్రతిభ చూపారు. కానిస్టేబుల్ శివకుమార్ ..(కర్నూలు ట్రాఫిక్ పియస్) గుంటూరు ఆచార్య యూనివర్సీటీలో లాంగ్ జంప్ లో క్యాంస పతకం సాధించారు. గతంలో సౌత్ జోన్ నేషనల్స్, కేరళ జూనియర్స్ నేషనల్ , రాష్ట్ర మరియు జిల్లా స్ధాయి లాంగ్ జంప్ పోటీలలో కూడ ప్రతిభ చూపారు. వీరిద్దరూ జాతీయ స్ధాయి క్రీడలలో కూడా పాల్గొంటారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు ఆర్ ఐ జావేద్, మాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాండురంగారెడ్డి, సెక్రటరీ రవికుమార్ ఉన్నారు.

# అమరావతికి చట్టబద్ధత లభించడం చారిత్రాత్మక ఘట్టం.

## - మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 02:** గురువారం నాడు మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో, వరాల రామయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన "అమరావతి అజేయ" కార్యక్రమంలో, మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారులు మరియు మాజీ శాసన మండలి చైర్మన్ జనాబ్ ఎం.ఏ. షరీఫ్ తో కలిసి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మరియు టీడీపీ పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ గారు మాట్లాడుతూ,ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట సవరణ బిల్లుకు ఉభయసభల్లో ఆమోదం లభించడం రాష్ట్ర చరిత్రలో ఒక గొప్ప మైలురాయి అని అన్నారు.అమరావతిని రాజధానిగా రూపుదిద్దిన ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి,ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఆ కి,ఐటీ, విద్యాశాఖ మంత్రి వర్యులునారా లోకేష్ కిఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అలాగే, అమరావతికి నేడు చట్టబద్ధత రావటంలో నాడు కీలక పాత్ర పోషించి,నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టేందుకు ఎన్ని అడ్డంకులు ఎదురైనా మొక్కవోని దీక్షతో ముందుకు సాగి,వైసీపీ దుర్మార్గపు ప్రయత్నాలను తిప్పికొట్టి,బెదిరింపులను లెక్కచేయకుండా,బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించి,నేడు అమరావతికి చట్టబద్ధత సాధనలో ముఖ్య భూమిక పోషించిన మాజీ శాసనమండలి చైర్మన్ మరియు మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారులు జనాబ్ ఎం.ఏ. షరీఫ్ కిప్రత్యేక కృతజ్ఞతలు మరియు అభినందనలు తెలియజేశారు.

# నంద్యాలలో తాసిల్దార్ కార్యాలయాలలో ఘనంగా సంబరాలు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 02:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతిని శాశ్వత రాజధానిగా చట్టబద్ధ గుర్తింపు లభించిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆనందోత్సవాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నిర్ణయం రాష్ట్ర ప్రజల దీర్ఘకాలిక ఆశయాలకు న్యాయం చేయడమే కాకుండా, అభివృద్ధి దిశగా కీలక మలుపుగా భావిస్తున్నారు.
ఈ సందర్భంగా నంద్యాల అర్బన్ తహసీల్దార్ కార్యాలయం. రంగురంగుల విద్యుత్ దీపాలతో మెరిసినది. అలాగే అర్బన్. రూరల్ కార్యాలయాలలో ముందు ముగ్గులు వేసి సిబ్బంది ఉత్సాహంగా సంబరాలు నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు.
ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు రూరల్ తాసిల్దార్ శ్రీవాణి. డిప్యూటీ తహసీల్దార్లు రామ చంద్ర రావు రామసంజీవరావు, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ శేఖర్ రెడ్డి,ఎలక్షన్ డిప్యూటీ తాసిల్దార్ శేఖర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సర్వేయర్ సహదేవుడు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు, వీఆర్ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలకు తీపి కబురు అందించిన కూటమి ప్రభుత్వం.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 02:**



నంద్యాల జిల్లా జనసేన పార్టీ నాయకులు దండు మురళీ కృష్ణ మాట్లాడుతూఅమరావతి చట్టబద్ధత బిల్లుకు రాజ్యసభ ఆమోదం.. మూజువాణి ఓటుతో బిల్లుకు రాజ్యసభ ఆమోదం.. నిన్న లోక్‌సభ, ఈ రోజు రాజ్యసభలో అమరావతి బిల్లు ఆమోదం.. పార్లమెంట్ ఆమోదంతో రాష్ట్రపతి వద్దకు వెళ్లనున్న బిల్లు.. రాష్ట్రపతి సంతకం తర్వాత ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత. పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందడం ప్రజాస్వామ్య గొప్పదనాన్ని, ప్రజా సంకల్పాన్ని చాటి చెప్పిన రోజు ఇది. దేశ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లిఖించదగిన రోజుగా ఇది నిలిచిపోతుంది. ఆంధ్రుల ఆశ, ఐదు కోట్ల ప్రజల శ్వాస! నాడు శంకుస్థాపన చేసిన అదే కరకమలాలతో, నేడు పార్లమెంట్ సాక్షిగా విభజన చట్టానికి సవరణ చేసి, అమరావతిని ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా సుస్థిరం చేసిన ధీశాలి మన ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారికి మంత్రి నారా లోకేష్ గారికి మన రాష్ట్ర లోక్ సభ మరియు రాజ్యసభ సభ్యులకు శతకోటి వందనాలు.

# మున్సిపల్ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.

## మెనూ పాటించకపోవడంపై ఆగ్రహం - సమస్యల పరిష్కారానికి డీఈఓకు ఆదేశం.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 02:**

నంద్యాల స్థానిక ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని మున్సిపల్ హైస్కూల్‌ను రాష్ట్ర న్యాయ శాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యా సౌకర్యాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆయన స్వయంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి స్వయంగా భోజనం చేసిన మంత్రి ఫరూక్ , విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. ఈరోజు మెనూ ప్రకారం విద్యార్థులకు గుడ్డు వడ్డించకపోవడాన్ని గమనించిన ఆయన, భోజన నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు పోషకాహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పాఠశాలలోని మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా వస్తున్న నీరు ఉప్పుగా ఉండటంతో విద్యార్థులు తాగడానికి ఇబ్బంది పడుతున్నట్లు మంత్రి ఫరూక్ దృష్టికి వచ్చింది. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చాలా కాలంగా స్లాబ్ లెవల్‌లో ఆగిపోయిన నిర్మాణ పనుల వల్ల, అక్కడ ఉన్న కట్టెలు ఎప్పుడు పడతాయోనని విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పాఠశాల





రికార్డులు, విద్యార్థులు మరియు సిబ్బంది హాజరు పట్టికలను తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై మంత్రి ఫరూక్ వెంటనే జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ రెడ్డి తో ఫోన్ లో మాట్లాడారు. మధ్యాహ్న భోజనంలో లోపాలు, తాగునీరు మరియు భవన నిర్మాణ సమస్యలను వివరించి, యుద్ధ ప్రాతిపదికన వీటిని పరిష్కరించాలని ఆదేశించారు.
పాఠశాల తనిఖీ అనంతరం మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం మెరుగైన పోషకాహారాన్ని అందిస్తోందని . మెనూ ప్రకారం గుడ్డు ఇవ్వకపోవడం సరికాదని విద్యార్థులకు పెట్టే భోజనం విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. నిర్లక్ష్యం వహించే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్ ఉన్నా విద్యార్థులకు ఉప్పు నీరు రావడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం మా బాధ్యత. వెంటనే ఈ సమస్యను పరిష్కరిస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలు విద్యార్థుల ప్రాణాలకు ముప్పుగా మారకూడదని . ఆగిపోయిన స్లాబ్ పనులను వెంటనే పూర్తి చేయాలని, ప్రమాదకరంగా ఉన్న కట్టెలను తొలగించాలని అధికారులను ఆదేశించారు . ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని . విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు, వారికి నాణ్యమైన విద్య అందేలా చూడాలని . జిల్లా విద్యాశాఖ అధికారులతో మాట్లాడి పాఠశాలలోని ప్రతి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ప్రజా తీర్పుకు పార్లమెంటు పట్టాభిషేకం..

# అమరావతికి దక్కిన రాజ్యాంగ రక్షణ.

## నంద్యాల గడ్డపై వెల్లివిరుస్తున్న విజయ గీతిక - మన రాజధాని, మన అమరావతి.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 02:**

నంద్యాల ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించే చారిత్రాత్మక నిర్ణయం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నంద్యాల నియోజకవర్గ టీడీపీ పార్టీ కార్యాలయంలో ఈ రోజు సాయంత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించి అనంతరం పార్టీ కార్యాలయం నుంచి పద్మావతి ఆర్చి వరకు భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగింది నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ నా రాజధాని అమరావతి అనే నినాదాలు పలికారు.
ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ ప్రజలు రాజధాని కోసం ఎదురుచూస్తూ, పోరాటం చేస్తూ వచ్చారని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో జగన్ మోహన్ రెడ్డి మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని మూడు ముక్కలుగా విభజించే ప్రయత్నం చేసి, ఆంధ్రప్రదేశ్‌కు స్థిరమైన రాజధాని లేకుండా చేసిన విషయాన్ని ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సంకల్పంతో అమరావతిని తిరిగి ఒకే రాజధానిగా నిలబెట్టడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ప్రత్యేకంగా అమరావతి రైతులు, మహిళలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునే క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ చూపిన పట్టుదల, పోరాట స్ఫూర్తి ఈ విజయానికి ప్రధాన కారణమని మంత్రి ఫరూక్ తెలిపారు. శాంతియుతంగా పోరాడిన రైతుల త్యాగాలకు ఇది దక్కిన న్యాయం అని అన్నారు. ఇవాళ ఆంధ్రప్రదేశ్2 ప్రజలందరికీ పండుగ రోజు అని, ఇకపై రాబోయే తరతరాలకు అమరావతి అభివృద్ధి మరియు సంక్షేమానికి రెండు కళ్లుగా నిలుస్తుందని, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందే బ్రాండ్‌గా అమరావతి రూపుదిద్దుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ఆనందాన్ని ప్రజలతో కలిసి పండుగలా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మద్దతుతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికి, మంత్రి నారా లోకేష్ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రామచంద్రరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకుల అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వాలు దేవాలయ మాన్యములకు..

# కాపలాధారే తప్ప హక్కుదారు కాదు.










**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 02:**

బనగానపల్లి మండలం భానుముక్కల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ దేవాలయానికి చెందిన దాదాపు 35 ఎకరాల మాన్యమును ప్రజలకు పంచిపెట్టే విధంగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టుగా మంత్రివర్యులు బీసీ జనార్దన్ రెడ్డి యొక్క మాటలు స్పష్టం చేస్తున్నాయి. ఈ భూముల పంపిణీకి సంబంధించిన పూజా కార్యక్రమాలు కూడా జరిగాయి. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా విశ్వ హిందూ పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రం విష్ణువర్ధన్ మాట్లాడుతూ...పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వటం విశ్వ హిందూ పరిషత్ స్వాగతిస్తుంది. అయితే అవి దేవాలయ మాన్యాలు ఇస్తే కచ్చితంగా ఖండిస్తుంది.అవసరమైతే ప్రజా పోరాటం,న్యాయపోరాటం చేయడానికి సిద్ధం అని తెలిపారు. ఈ దేవాలయ భూముల పంపిణీ విషయంలో విశ్వ హిందూ పరిషత్ అభ్యంతరాలను కలెక్టర్ కి, ఎండోమెంట్ డీఈవో కి వినతిపత్రంతో తెలియజేస్తామని తెలిపారు.విశ్వ హిందూ పరిషత్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఈ విధంగా దేవాలయ మాన్యాలను పంచుకుంటూ, ప్రత్యామ్నాయ స్థలాలు ఇచ్చుకుంటూ వెళితే ఏదో ఒక రోజున దేవాలయ వ్యవస్థ కుంటుపడటం తప్పదు.దేవాలయ వ్యవస్థ యధాతరంగా ఉండాలంటే ఆ యొక్క మాన్యముల పరిరక్షణ పకడ్బందీగా ఉండాలి. అంతేగాని ప్రభుత్వ అవసరాలకు దేవుడి విలువైన మాన్యాలను ఇవ్వడం సరైనది కాదని తెలిపారు.దేవాలయ భూములను రక్షించాల్సిన ప్రభుత్వాలే ఈ విధంగా దేవాలయ భూములను ఇవ్వడం సరైనది కాదన్నారు.
నంద్యాల జిల్లా విశేష సంపర్క ప్రముఖ కాల్వ శేష సాయి గారు మాట్లాడుతూ గతంలో దేవాలయ భూములను ఈ విధంగా అన్యాక్రాంతం చేయాలని చూస్తే ఇది తప్పు అని కోర్టు తీర్పులు కూడా వచ్చాయి అన్నారు.
ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి గారు పాల్గొన్నారు.



## మానవాళి పాప పరిహారం కోసం

# సిలువపై త్యాగం

## నేడు గుడ్ ఫ్రైడే



సమస్త మానవాళి చేసిన పాపాల కోసం ఆయన సిలువపై ప్రాణాలు అర్పించారు. తిరిగి మూడో రోజు సమాధి నుంచి లేచాడు. పొరుగువారిని ప్రేమించాలని వారి తప్పులను క్షమించాలంటూ తాను భూమిపై జీవించిన రోజుల్లో బోధనలు చేశారు. ఆయనే జీసస్. క్రైస్తవ మత విశ్వాసం ప్రకారం యేసుక్రీస్తు శుక్రవారం సిలువ వేయబడ్డాడు. యేసు క్రీస్తు మరణిస్తే శుభ శుక్రవారం లేదా గుడ్ ఫ్రైడే అని ఎందుకు పిలుస్తున్నాము ..? అసలు శుభం ఎలా అవుతుంది..?

**గుడ్ ఫ్రైడే ... శుభశుక్రవారం.** చాలామంది తెలియని వారు గుడ్ ఫ్రైడే అంటే ఏదో పండగలా భావిస్తారు. ఇందుకు కారణం ఆ పదంలో గుడ్ అంటే శుభం అని ఉండటమే. వాస్తవానికి గుడ్ ఫ్రైడ్ అంటే క్రైస్తవుల ప్రకారం మానవాళి చేసిన పాపాల కోసం తన ప్రాణాలను జీసస్ సిలువపై పణంగా పెట్టాడని చెబుతారు. జీసస్‌ను సిలువపై వ్రేలాడదీసిన రోజును పవిత్ర శుక్రవారం, లేదా బ్లాక్ ఫ్రైడే అని కూడా పిలుస్తారు. యేసు ప్రభువు చనిపోయిన రోజును గుడ్ ఫ్రైడేగా పిలుస్తారు. ఈ రోజున క్రైస్తవులు ఉపవాసం ఉండి దేవున్ని తలచుకుంటారు. ప్రార్థనలో గడుపుతారు.

**వివిధ దేశాల్లో గుడ్ ఫ్రైడేకు పలు రకాల వివరణలు**

ఇదిలా ఉంటే గుడ్ ఫ్రైడే పేరు ఎక్కడి నుంచి వచ్చిందో ఎవరికీ తెలియదు. అయితే గుడ్ ఫ్రైడే అనే ఈ పేరు ఎలా వచ్చిందో అనేదానికి పలువురు పలు రకాలుగా వారి వాదనలు వినిపిస్తున్నారు. శుభ శుక్రవారంలో ఏదో మంచి ఉందని చాలా మంది భావిస్తారు. యేసు ప్రభువు సమస్త మానవాళి చేసిన పాపాలకు తన ప్రాణాలు అర్పించి పునరుత్థానం చెందాడని చెబుతారు. మరికొందరు గుడ్ అనే పదం ఇంగ్లీషులో ఏమైతే అర్థం ఇస్తుందో దాని ప్రకారంగానే హోలీ ఫ్రైడే అని పిలుస్తారని చెప్తారు. లెంట్ కాలంలోనే గుడ్ ఫ్రైడే వస్తుంది. ఈ సమయంలో క్రైస్తవులు మాంసాహారం తీసుకోరు. గుడ్ ఫ్రైడే రోజున ఒక సారి పూర్తి స్థాయి భోజనం మరో రెండు పూట్ల ఫలహారం తీసుకుంటారు.

**పొరుగువారిని ప్రేమించి వారిని క్షమించాలి:**

యేసుప్రభువు ప్రపంచ వ్యాప్తంగా గుడ్ ఫ్రైడే రోజున ఒకొక్కరూ ఒక్కొక్క పద్ధతిని పాటిస్తారు. కొందరు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపి ప్రార్థనను ముగించేందుకు సూచనగా 33 సార్లు చర్చి గంటను మోగిస్తారు. క్రిస్మస్ వేడుకల కంటే చాలా ప్రాచీనమైనది గుడ్‌ఫ్రైడే. క్రైస్తవుల పవిత్ర గ్రంథం బైబిల్ కూడా జీసస్ పుట్టుక గురించి ఆయన పుట్టిన తేదీ గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. కానీ ప్రభువును శిలువ వేయడాన్ని గురించి ప్రస్తావించింది. యూదా ఇస్కరియోత్ అనే యేసు ప్రభువు శిష్యుడు కేవలం 33 వెండి నాణేల కోసం యేసు ప్రభువుకు నమ్మక ద్రోహం చేస్తాడు. క్రీస్తు ఎక్కడున్నాడో సైన్యానికి చెప్పేస్తాడు. ఆ తర్వాత క్రీస్తును తీసుకురావడం ఆయన్ను సిలువ వేయడం సిలువపై వ్రేలాడి ఉండగా ప్రభువు చివరిగా మాట్లాడే ఏడు మాటలను క్రైస్తవులు ఈ రోజు గుర్తు తెచ్చుకుని ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. క్రీస్తు యేసు తాను భూమిపై బతికున్న రోజుల్లో ఎన్నో బోధనలు చేశారు. అందులో ముఖ్యమైనది తమ పొరుగువారిని ప్రేమించి వారి తప్పులను క్షమించాలని చెప్తారు. దీన్నే క్రైస్తవులు అనుసరిస్తారు.

## వహిద్ హుస్సేన్ కార్యాలయంలో ఘనంగా అమరావతి సంబరాలు.






**ఆంధ్ర ప్రగతి కర్నూలు ఏప్రిల్ 02:** అమరావతి బిల్లు ఆమోదం రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి వహీద్ హుస్సేన్ కార్యాలయంలో ఘన సంబరాలు గురువారం పార్లమెంట్ మరియు రాజ్యసభ ఉభయ సభల్లో ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి రాజధానిగా బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా కర్నూల్‌లోని వహీద్ హుస్సేన్ కార్యాలయంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు.వహీద్ హుస్సేన్ సోదరులునిషార్ అహ్మద్ ఆధ్వర్యంలో ఈ సంబరాలు నిర్వహించబడినవి.ఈ సంబరాల్లో డి. జేమ్స్ (ఎస్సీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్), అఖిల్ (ఐటీడీపీ), డా. ప్రవీణ్ (టిడిపి నాయకులు), సయ్యద్ బాష (ఐటీడీపీ, కర్నూలు రూరల్ మండలం, కోడుమూరు నియోజకవర్గం) తదితరులు పాల్గొన్నారు.అలాగే టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగినది. ఈ సందర్భంగా పాలాభిషేకం, బాణాసంచా కాల్చడం, కేక్ కట్ చేయడం వంటి కార్యక్రమాలతో సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

## అనిశ్చితికి తెరపడింది..

**అమరావతి ఏకైక రాజధానిగా నిలిచింది: డిప్యూటీ సీఎం పవన్**

**అమరావతి ఏప్రిల్ 2 ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే కీలక బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొందింది. లోక్‌సభలో ఇప్పటికే ఆమోదం పొందిన ఈ బిల్లు, గురువారం పెద్దల సభలోనూ నెగ్గడంతో అమరావతికి రాజధానిగా తిరుగులేని చట్టపరమైన హోదా లభించింది. ఈ చారిత్రక పరిణామం పట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ఐదు కోట్ల ఆంధ్రుల విజయమని, ప్రజల ఆత్మగౌరవ పునరుద్ధరణ అని ఆయన అభివర్ణించారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. “త్యాగాల పునాదుల నుంచి, ఆశలు మోసుకొచ్చిన కన్నీటి నుంచి, అనిశ్చితిని భరించిన నిశ్శబ్దం నుంచి అమరావతి నేడు కోట్లాది ప్రజల ఆశలను మోస్తూ గౌరవంగా నిలబడింది“ అని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. గత కొన్నేళ్లుగా రాజధాని ఉనికిపై సాగిన కుట్రలు, అపోహలు, న్యాయపరమైన చిక్కులను అధిగమించి, పార్లమెంట్ సాక్షిగా అమరావతి ఒక అజేయ శక్తిగా అవతరించిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఎట్టకేలకు న్యాయం జరిగిందని, ఈ విజయం ఎన్డీఏ ప్రభుత్వంపై చెక్కుచెదరని విశ్వాసం ఉంచిన ప్రతి పౌరుడిదని తెలిపారు.అమరావతి ఆత్మ రైతుల త్యాగంలోనే ఉందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. “33,000 ఎకరాలకు పైగా భూములను రైతులు బలవంతంగా ఇవ్వలేదు. భవిష్యత్‌పై, ఒక దార్శనికతపై నమ్మకంతో ఇచ్చారు. ఈ రోజు వారి నమ్మకాన్ని గౌరవించగలిగాం“ అని పేర్కొన్నారు. ఈ చారిత్రక ఘట్టంలో రాష్ట్రానికి గుర్తింపు కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఆయన నివాళులు అర్పించారు.గత కొన్నేళ్లుగా అమరావతిని అనిశ్చితిలోకి నెట్టారని, విధానాలు మార్చి రైతులను మోసం చేశారని, ప్రజల ఆకాంక్షలను నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఆ అనిశ్చితికి తెరపడిందన్నారు. ఇది కేవలం రాజధాని పునరుద్ధరణ మాత్రమే కాదని, ప్రజల ఆత్మగౌరవ పునరుద్ధరణ అని పేర్కొన్నారు. స్పష్టమైన దార్శనికతతో అమరావతి అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ప్రతి కీలక సమయంలో రాష్ట్రానికి అండగా నిలిచిన ప్రధాని నరేంద్ర మోదీకి, ఎన్డీఏ ప్రభుత్వానికి, బిల్లుకు మద్దతిచ్చిన అన్ని రాజకీయ పార్టీలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## నంద్యాల నియోజకవర్గ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమావేశం.

**...దిశా నిర్దేశం చేసిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి. -నేటి తో ముగియనున్న స్థానిక సంస్థల పదవీకాలం.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 02:**
నంద్యాలలో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధుల ఆత్మీయ కలయిక ప్రాధాన్యతను సంతరించుకున్నది. నంద్యాల నియోజకవర్గంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పదవీకాలం రేపటితో ముగియనున్న నేపథ్యంలో, నంద్యాల మరియు గోస్పాడు మండలాలకు చెందిన ఎంపీపీలు, సర్పంచ్‌లు, వైస్ సర్పంచ్‌లు మరియు ఎంపీటీసీలతో గురువారం నాడు నంద్యాల పట్టణంలోని అన్నపూర్ణ హోటల్ నందు భారీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మరియు మాజీ రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి పాల్గొని ప్రజాప్రతినిధులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములైన ప్రతి ఒక్క ప్రజాప్రతినిధికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేశారు. రానున్న ఎన్నికలే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. వైసీపే నాయకత్వంలో అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, రాబోయే ఎన్నికల్లో పార్టీ అత్యధిక మెజారిటీతో మళ్ళీ అధికారాన్ని చేపట్టేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం పరిశీలకుడు పీపీ మధుసూధన్ రెడ్డి,ఎంపీపీలు శెట్టి ప్రభాకర్, ఆర్థర్ సైమన్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి.మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు పురుషోత్తం రెడ్డి, మహేశ్వరరెడ్డి, వైసీపీ జిల్లా కార్యదర్శి: శివనాగిరెడ్డి, నంద్యాల మండల అధ్యక్షుడు: బసవేశ్వరరెడ్డి, వైసీపీ నేత: ప్రహ్లాదరెడ్డి మరియు పెద్ద సంఖ్యలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ ఆత్మీయ సమావేశం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

## నంద్యాల గడప గడపకూ మోదీ ‘సుజలధార’.!

**..నీటి కష్టాలకు చెక్.. జిల్లాలో 1.41 లక్షల ఇళ్లకు నూతన కుళాయిలు.**

**..జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన జలం.**

**..నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 02:**
దేశంలోని ప్రతి గ్రామీణ ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నదే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పమని నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు పేర్కొన్నారు. ‘జల్ జీవన్ మిషన్‘ పథకంలో భాగంగా నంద్యాల జిల్లాలో సాధించిన ప్రగతిని వివరిస్తూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.మోదీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘హర్ ఘర్ జల్‘ పథకం ద్వారా జిల్లాలో తాగునీటి కష్టాలు తీరుతున్నాయని ఆయన తెలిపారు. 2026 నాటికి జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 1,41,064 గృహాలకు నూతన కుళాయి వసతిని కల్పించినట్లు ఆయన స్పష్టం చేశారు. “గతంలో తాగునీటి కోసం మహిళలు కిలోమీటర్ల మేర నడవాల్సి వచ్చేదని, నేడు ప్రతి గడపకూ స్వచ్ఛమైన జలం చేరుతోందని“ అభిరుచి మధు కొనియాడారు.లక్ష్యం నెరవేరింది ప్రతి గ్రామీణ గృహానికి రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా కేంద్రం నిధులు కేటాయిస్తోంది.జిల్లాలో పురోగతి నంద్యాల గడప గడపకూ స్వచ్ఛమైన నీరు చేరుతోంది.ప్రజల హర్షం: నూతన కుళాయి వసతి పొందిన 1.41 లక్షల కుటుంబాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.ప్రతి పేదవాడి సొంతింటి కల, ఆరోగ్యకరమైన జీవనం కోసం మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, జిల్లాలో మిగిలిన గృహాలకు కూడా త్వరలోనే ఈ వసతి కల్పిస్తామని అభిరుచి మధు ఈ సందర్భంగా వెల్లడించారు.